
# తంపులమారి సోమలింగం



సోమలింగం సూటిగా చూస్తే పచ్చని చెట్టు మాడిపోతుంది. నడిచిన నేలన పచ్చిక కూడా మొలవదు. అంతటి పుణ్యపురుషుడు కాబట్టే భర్త విశ్వరూపం చూడలేకనో యేమో, ఇల్లాలు చిన్నప్పుడే పరలోకం చేరింది. ఒంటిగా ఒక్కడు. ఇంత వుడకేసుకుని తినడం, వూరంతా తిరిగేస్తూ ప్రజాసేవ చేయడం.

ప్రొద్దున కృష్ణలో స్నానంచేస్తూ సోమలింగం దోసెడు నీళ్ళు సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చి పక్కకు చూస్తే ముసలయ్య కావిడి ముంచుతూ కనిపించాడు. అర్ఘ్యం ఆపి ---

"ఏం ముసలయ్యా ! బాడవపక్క చేను కొన్నావంటగా" అన్నాడు.

"అయ్యా" అన్నాడు ముసలయ్య.

"నీళ్ళు ముంచుకోవడం తరువాత. ఆ పొలం కొని నువు మునిగావేమో చూసుకున్నావా." అన్నాడు సోమలింగం.

కావిడొదిలేసి రెండు చేతులూ జోడించాడు ముసలయ్య.

"కంగారులేదు. కాగితాలు పట్రా చూస్తాను" అంటూ సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చాడు సోమలింగం.

పరుగున పరుగున కాగితాలు తెచ్చాడు ముసలయ్య.

సోమలింగం చదివి కాసేపు జుత్తు పీక్కుని, మరికాసేపు నుదురు బాదుకుని, "ఈ పొలం అమ్మే హక్కు సుబ్బయ్యకు లేదయ్యా"అన్నాడు.

ముసలయ్యకు కడుపు మండింది.

"డబ్బిచ్చి కొనుక్కుని రిజిస్ట్రీ చేయించుకుంటే, చెల్లదంటారేటండీ" అని అరిచాడు.

"ఆ అరుపులూ కేకలూ ఎందుకయ్యా? నీ కాగితాలు చెల్లుతాయో, నామాట చెల్లుతుందో చూద్దాంగా" అన్నాడు సోమలింగం.

"మీరు చేసేదేందో చేసుకోండి" అని విసురుగా వెళ్ళిపోయాడు ముసలయ్య. వెళ్ళిన మరుక్షణం వేలువిడిచిన మేనమావ కొడుకు ఎవడో భద్రయ్యనే వాడికి కబురెళ్ళనే వెళ్ళింది. "పదెకరాల పొలం పాయసంలా జుర్రుకో, వెయ్యి దావా"అన్నాడు సోమలింగం. వ్యాజ్యం ఆరేళ్ళపాటు సాగింది.

ముసలయ్య పొలమైతే దక్కించుకున్నాడుగానీ, కొన్న ఖరీదుకు మూడింతలు కోర్టుకు ధారపోశాడు.

ఓ రోజు సోమలింగం బజారున వెళుతూంటే పుల్లయ్య ఇంటి వాకిటికి తోరణాలు కనిపించాయి. సోమలింగానికి పచ్చటి ఆకులన్నా పసుపు తాళ్ళన్నా గొప్ప చిరాకు. పదడుగులు బజార్లోకేసి భూమయ్యని పిలిచి చెట్టు క్రింద కూర్చోబెట్టి ఈ విధాన బోధ చేశాడు. "నీకు పుల్లయ్య అప్పున్న మాట నిజమే. మనవాడూ కావల్సినవాడూ, ఆదుకుందామన్న ఉద్దేశ్యంతో అప్పిచ్చావు సంతోషమే, అడిగినప్పుడల్లా పుల్లయ్య తిరిగి ఇవ్వకుండా వాయిదా వేస్తున్నాడు. నీ నిదానం మెచ్చుకో దగినదే. నువ్వు ఉత్తముడివి, కానీ ఆ అప్పు ఈ జన్మలో తిరిగిరాదని తెలిస్తే నువ్వేమైపోతావు. పెళ్ళి కావల్సిన ఆడపిల్లుంది. పైకిరావాల్సిన పసివాళ్ళున్నారు. వాళ్ళ గతేమిటి?" భూమయ్య బేలగా అడిగాడు "అయితే నా డబ్బు నీళ్ళపాలేనా."

"పాలు లేవు నీళ్ళే ! వెళ్ళి చూడు వ్రతాలు చేస్తున్నాడు. మొన్న ఒక వ్రతం. ఇవ్వాళో వ్రతం. వీటికి డబ్బులెక్కడివి. నేను చెప్తున్నాను నమ్ము. నీ బాకీ తీర్చడానికి డబ్బులేక కాదు, నీకు మొండిచెయ్యే."

భూమయ్యకు భయం వేసింది. ఆ భయంలోంచి కోపం పొంగింది. బారలు బారలుగా నడుస్తూ పుల్లయ్య ఇంటికొచ్చి గొంతుమీద కూర్చుని బాకీ తీర్చమన్నాడు. పుల్లయ్య డబ్బులేదని మొత్తుకుంటే నగానట్రా తాకట్టు పెట్టించుకుని వెళ్ళిపోయాడు. సోమలింగం బజారునుంచి తిరిగొస్తుంటే పుల్లయ్య ఇంటి వాకిటి తోరణాలు తెగి వున్నాయి. తృప్తిగా నవ్వుకుని కుక్కి మంచంలో హాయిగా నిద్రపోయాడు.

ఎవరైనా ఇల్లాలు మెడనిండా నగలతో కనిపిస్తే సోమలింగానికి కంపరమెత్తేది. ఎవడైనా నవ్వుతూ కనిపిస్తే వెన్నులో పోటొచ్చేది. సోమలింగం చూపుకి వూరంతా భయపడేది. ఎవర్నయినా పైనుంచి కిందికి ఎగాదిగా చూశాడో వాడికి మూడినట్టే.

ఒక్క ముసలి బుచ్చమ్మే సోమలింగానికి ఎదురుగా వెళ్ళగలదు. నాలుగూ పెట్టగలదు. బుచ్చమ్మ కఱ్ఱపోటుతో వస్తుంటే సోమలింగమే పక్కకు తప్పుకునేవాడు. పోయేవాడ్ని పిలిచి మరీ తిట్టేది బుచ్చమ్మ.

"దిష్టి ముండాకొడకా! పదిమంది ఉసురు పోసుకుంటున్నావు గదరా! పట్టెడన్నం ఏనాడైనా ఎవరికైనా పెట్టావా? కొంపలు కూల్చే నీకు కునుకెట్టాపడు తుందిరా?" సోమలింగం వులకడు, పలకడు. తలొంచుకుని సందుల్లోకి తప్పుకుంటాడు. అతనికి బుచ్చమ్మ చూపులు సూదుల్లా, మాటలు శూలాల్లా గుచ్చుకుంటాయి.

ఉన్నట్లుండి సోమలింగం మంచాన పడ్డాడు. తనకి అవసానదశ సమీపించిందని తెలుసుకున్నాడు. వూరందర్నీ చిన్నా, పెద్దా పిలిపించాడు. అందరికీ చేతులెత్తి దణ్ణంపెట్టి అన్నాడు. "నేను పాపాత్ముణ్ణి. మీ కందరికీ అపకారం చేశాను. క్షమించగలిగితే క్షమించండి. నా చివరి కోరిక ఒక్కటి తీర్చండి. నన్ను దహనం చేయకండి. అంత పుణ్యానికి నేను తగను. నేను పాపిని. నన్ను గోరీలదొడ్లో పాతిపెట్టండి. నన్ను భూస్థాపితం చేస్తేనే నాకు శాంతి." అదేమికోరిక అన్నారంతా. పాతి పెట్టిస్తామని అందరిదగ్గరా వాగ్దానం చేయించుకుని ఆఖరిశ్వాస విడిచాడు సోమలింగం.

మాట ప్రకారం సోమలింగాన్ని గోరీల దొడ్డికి మోసుకెళ్ళారు. సాయెబులు హిందువుని గోరీల దొడ్లో పాతిపెడ్తే వూరుకుంటారా. వీల్లేదని తిరగబడ్డారు. వూరు తిరగబడింది. కఱ్ఱలు లేచాయి. దొమ్మీ జరిగింది. ఆ హోరాహోరీలో బుచ్చమ్మ కఱ్ఱపోటుతో వచ్చి "ఆగండ్రోయ్ !" అనిఅరిచింది. ఆగారు.

"ఇంత మందున్నారు బుద్ధిలేక పోయెనే! వాడు చచ్చిం తర్వాత కూడా మీకు మాకూ పోట్లాట పెట్టడానికి తన్ని పాతిపెట్టమన్నాడ్రా!"అంది. అందరికీ తెలివొచ్చింది.

హిందువులు, ముస్లింలు ఏకంగా సోమలింగాన్ని కృష్ణొడ్డుకు మోసుకెళ్ళి బూడిద చేశారు.*